క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ ఒకటి ఖాళీ ఉందని పేర్కొన్నారు. ఈనెల 13లోగా కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని, 15న ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయ్‌రావ్ మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులందరూ ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, ఉపాధ్యాయులు, పీడీ, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ సేన మండల కన్వీనర్‌గా వినోద్

తాంసి: ఆదివాసీ సేన భీంపూర్ మండల కన్వీనర్‌గా మండలంలోని కరన్‌వాడీ గ్రామానికి చెందిన గెడం వినోద్‌ను నియమించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ సేన భవన్‌లో జరిగిన జిల్లా సమావేశంలో జిల్లా కన్వీనర్ రాయిసిడాం జంగు ఆధ్వర్యంలో వినోద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

బోథ్: నర్సరీ మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని ట్రెయినీ కలెక్టర్ కలెక్టర్ శ్రీజ అన్నారు. శుక్రవారం మండలంలోని పట్నాపూర్‌లో పర్యటించారు. నర్సరీని పరిశీలించి, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు నీరు పోయాలని తెలిపారు. అనంతరం రైతువేదికలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతిఒక్కరూ కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో జీవన్‌రెడ్డి, కార్యదర్శి మిథున్, ఏఈవో శ్యాం, సంపత్, కవిత, సర్పంచ్ సుగుణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వంటల పోటీలు

కైలాస్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మెప్మా ఆధ్వర్యంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం మున్సిపల్ నూతన భవనంలో సమాఖ్యల ఆర్‌సీలు, ఎస్‌ఎల్‌ఎఫ్ ఓబీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వంటల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ అధికారులు శోభ, అన్నపూర్ణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి 14న బహుమతులను ప్రదానం చేయనున్నట్లుగా మెప్మా డీపీఎం శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎంవో వెంకటమ్మ, టీఎంసీ భాగ్యలక్ష్మి, సీవోలు పండరి, పన్నాలాల్, గంగాధర్, సునీత, డీఈవో జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డెన్‌లో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న హథ్ సే హథ్ జోడో నియోజకవర్గ సమావేశాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఏఐసీసీ సభ్యులు నరేశ్ జాదవ్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సమావేశంలో ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్ ఖాన్, మండల అధ్యక్షుడు నారాయన్‌రెడ్డి, జాదవ్ వసంత్‌రావు, జిల్లా కార్యదర్శి డెగాల భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తాంసి: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని భీంపూర్ వైద్యాధికారి విజయసారథి సూచించారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 28 మంది గర్భిణులకు బీపీ, రక్తపరీక్ష, స్కానింగ్ నిర్వహించారు. అనంతరం న్యూట్రీషియన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిఖిల్, ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, లూసి, సిబ్బంది ప్రవీణ, శ్రీదేవి, గోదావరి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ చాందా(టి) పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒకేచోట కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చదువులు చెప్పిన గురువులు కిషన్, సుజాత, భాస్కర్, కిషోర్ కుమార్, శంశోద్దీన్, గంగన్న, జయవర్ధన్ రెడ్డి, సతీష్‌లను సత్కారించి జ్ఞాపికలు అందజేశారు.

రోడ్డు కష్టాలు..



లాండసాంగ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

- 4 కిలోమీటర్లు.. 30 నిమిషాల ప్రయాణం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి వెళ్లే రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు సంభవించడంతోపాటు వాహనాలు మొరాయిస్తున్నాయి. ప్రయణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నా.. కనీసం పట్టించుకునే వారే కరువయ్యారు. ఇటీవల జైనథ్ మండలం తర్నం వంతెన కుంగిపోవడంతో భారీ వాహనాలు లాండసాంగ్వి మీదుగా వెళ్తున్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా మరో వాహనం వస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. అలాగే రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రతీ రోజు ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు.

ఆరగంట సమయం..

జిల్లా కేంద్రం నుంచి లాండసాంగ్వి గ్రామానికి ఐదు నుంచి పది నిమిషాల్లో చేరుకోవచ్చు. కానీ ఆరగంట సమయం పడుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని లాండసాంగ్వి, అర్లి (బి), జైనథ్ మండలంలోని ఆడ, కంఠ, ముక్తపూర్, తదితర గ్రామాల ప్రజలు లాండసాంగ్వి వంతెనపై ఆందోళన చేపట్టారు. అయినా.. ఇప్పటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి స్పందన లేదు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి ఇలా ఉంటే మరుమూల గ్రామానికి వెళ్లే రోడ్ల దుస్థితి ఎలా ఉంటుందోనని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

జిల్లా కేంద్రం నుంచి లాండసాంగ్వి గ్రామం మీదుగా అర్లి (బి) గ్రామాలకు వెళ్లే రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. దీంతో అత్యవసర సమయంలో వెళ్లే వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి

తమ గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి ప్రతీ రోజు రాకపోకలు నిర్వహిస్తా. ఈ రోడ్డు గుండా ప్రతీ రోజు వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఇటీవల తర్నం బ్రిడ్జి కుంగడంతో భారీ వాహనాలు లాండసాంగ్వి గ్రామం మీదుగా వెళ్తున్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– గొర్ల గణపతి, లాండసాంగ్వి, గ్రామస్తుడు

నిధులు మంజూరయ్యాయి

జిల్లా కేంద్రం నుంచి లాండసాంగ్వి మీదుగా అర్లి (బి) వరకు 8.5 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం పనులకు రూ. 3 కోట్ల 61 లక్షల 50 వేలు మంజూరయ్యాయి. టెండర్‌లు సైతం పూర్తయ్యాయి. ప్రస్తుతం అగ్రిమెంట్ దశలో ఉంది. 10 నుంచి 15 రోజుల్లోగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– సల్లాఉద్దీన్, ఏఈ, పీఆర్

అటెన్షన్ ప్లీజ్.. డ్రెయినేజీ నిర్మించండి



బోథ్: మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ పక్కన రోడ్డు. డ్రెయినేజీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. బస్టాండ్ నుంచి హాస్టల్‌కు రావాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి: అంజయ్య, పంచాయతీ కార్యదర్శి, బోథ్, ఫోన్: 99853 46280

26న ఇంద్రాదేవి ఆలయ కలశస్థాపన



సమావేశంలో చర్చిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి: ఇంద్రాదేవి ఆలయ కలశ స్థాపన వేడుకలను ఈనెల 25, 26న నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ పెద్దలు, గ్రామ పటేల్‌లు, సార్‌మెడిలు, మహాజన్, దేవరీలు, మహిళలు పెద్ద మొత్తంలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఇంద్రు పటేల్, భీంరావ్, కోరెంగా సుంకట్‌రావ్, కోరెంగా యేశ్వంత్‌రావ్ మహరాజ్, పెందోర్ అర్జున్, పెందోర్ పుష్పరాణి, మరప రాజు, శేకు పాల్గొన్నారు.

‘అక్రమ లే అవుట్లు తొలగించాలి’



ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

బేల: బేల గ్రామ పంచాయతీ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా బురాన్‌పూర్ శివారులోని సర్వే నంబరు 29లో 13.27 ఎకరాల్లో వెలిసిన అక్రమ లే అవుట్లు, అక్రమ నిర్మాణాలను తొలగించాలని మండల ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు ఆడ శంకర్, ఉపాధ్యక్షుడు నైతం సీతరాంలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కృష్ణకుమార్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ లేఅవుట్‌పై నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. అక్రమ లే అవుట్‌ను పూర్తిస్థాయిలో ఖాళీ చేయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొరంగే జంగ్‌షా, నాయకులు కొడప భీంరావు, సిడాం నందకుమార్, కుషాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



బోథ్: పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న బలరాం జాదవ్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని గ్లోబల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రతినిధి విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంస్థ ద్వారా పలు మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించారు. బాలికల కోసం రూ.9 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదే విధంగా సైన్స్ విద్యార్థుల కోసం రూ.42 వేల విలువ గల సైన్స్ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ విఠల్‌కు అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

బోథ్: విద్యార్థులు కష్టపడి చదవాలని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్లపెల్లిలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం తనవంతు సాయం చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల్లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ఎంఐఎం తరపున పుస్తకాలు అందజేశారు. ఈసందర్భంగా హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు శాహెద్ అహ్మద్ తవక్కల్ మాట్లాడుతూ.. ఎంఐఎం తరపున గత పది సంత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పుస్తకాలను విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు శన్వాజ్, ఇచ్చోడ మండల అధ్యక్షుడు జావిద్, సోఫియాన్, గఫర్, ఫిర్దోస్, జాహెద్, అర్షద్, ముబిన్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలను బార్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెందూర్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా జమీర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ జగన్, సంయుక్త కార్యదర్శిగా జైవంత్‌రావు, కోశాధికారిగా చింతల గిరి, లైబ్రరీ సెక్రటరీగా కొమ్ము విజయ్, చిమ్నా నాయక్, సలహాదారులుగా జీఎల్ గుప్తా, బాపురెడ్డి, ధీరజ్ గుప్తా, కార్యవర్గ సభ్యులుగా బాపురావు, వసంత్‌రావు, శ్రీనివాస్, కుడెల్లి అశోక్, రాజు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

ఆదిలాబాద్: ఇటీవల పలు సంఘాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు చేపట్టిన పలువురు నాయకులను జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి శుక్రవారం ఆమె నివాసంలో సన్మానించారు. ఆయా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సన్మానం పొందిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం కన్వీనర్ తోకల నరేష్, కోకన్వీనర్ విద్యాసాగర్, నకాశి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ వర్మ, ఓసీ సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి అశ్విన్‌లు ఉన్నారు.

యువకుడి రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఓ యువకుడు ఉదారత చాటాడు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామానికి చెందిన ఓవ్యక్తి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడికి అత్యవసరంగా రక్తం అవసరం ఉండగా.. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన గాజరి వెంకటేష్ స్పందించి రక్తదానం చేశాడు. దీంతో బాధిత కుటుంబీకులు వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆవుకు అంత్యక్రియలు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఆదిత్యనగర్ కాలనీలో శుక్రవారం ఆవు మృతి చెందడంతో గోమాత సేవ ఫౌండేషన్ సభ్యులు ఆవుకు సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. గోమాతలకు ఎటువంటి గాయాలు అయిన సమాచారం ఇవ్వాలని ఫౌండేషన్ అధ్యక్షుడు సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఫౌండేషన్ ప్రతినిధులు సాయికృష్ణ, హిమాన్షు, రాజశేఖర్, రాజారెడ్డి, వంశీ, కార్తీక్ పాల్గొన్నారు.

15 నుంచి 144 సెక్షన్

కైలాస్‌నగర్: ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల నుంచి 300 చదరపు అడుగుల దూరం వరకు నాలుగురికి మించి ఎక్కువ మంది ఉండొద్దన్నారు. జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచాలని ఆదేశించారు.

పరిహారం ఇప్పించండి

బోథ్: మండలంలోని కరత్వాడ గ్రామానికి చెందిన గుమ్ముల ఎల్లయ్య గేదె విద్యుత్ షాక్‌తో చనిపోయిందని తనకు నష్టపరిహారం ఇప్పించాలని బోథ్ ఎస్సై రవీందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశాడు. ఈనెల 8వ తేదీన మందలోకి పంపిచానని, సాయంత్రం ఇంటికి రాలేదన్నారు. మరుసటి రోజు గేదెను వెతకగా వాగులో విద్యుత్ షాక్ తగిలి చనిపోయిందని బాధితుడు తెలిపాడు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శోభాబాయి
- అధికారులను నిలదీసిన సభ్యులు



అధికారులను నిలదీస్తున్న సభ్యులు

ఇంద్రవెల్లి: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారుల తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారులు నివేదిక చదువుతుండగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీశారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య ఉన్న గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమాచారం అందించినా.. అధికారులు స్పందించడం లేదన్నారు. మండలంలో కిడ్నీ వ్యాధి మరణాలు ఎక్కువ అయ్యాయని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వంతో పని చేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిచాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ గంగాధర్, ఇన్‌చార్జి ఎంపీడీవో వేణు, ఎఫ్‌ఆర్‌వో రత్న జాడే శీలానంద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్, సినిమారోడ్, మోచిగల్లి, ద్వారకానగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. బంగారుగూడ, అంకోలి, పిప్పల్‌ధరి సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రూరల్ అదనపు ఏఈ తెలిపారు. రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, సప్తగిరి కాలనీ, కైలాస్‌నగర్, రిమ్స్, కలెక్టర్ చౌక్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో సరఫరాలో అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌లు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్: బోథ్, పాచ్పెర సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

బోథ్: ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పట్నాపూర్, రేండ్లపల్లె గ్రామాల్లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరీష్, కుమ్మరి విజయ్, పూజారి మడావి మనోహర్, కనక అమృత్ రావ్, పట్నాపూర్ సర్పంచ్ పంద్రం సుగుణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ఉట్నూర్‌రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి విఘ్నేశ్వర వొకేషనల్ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి. దుర్గారాణి గృహహింస, బాల్య వివాహాలు, దాడులు, పీవోసీఎస్‌వో వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జమీర్‌ఖాన్, ధీరజ్ గుప్తా, జగన్, సీహెచ్ గిరి, జైవంత్‌రావు, వసంత్‌రావు, అశోక్, రాజు పాల్గొన్నారు.

సావిత్రీబాయికి ఘన నివాళి



తలమడుగు: నివాళులర్పిస్తున్న నాయకులు

తలమడుగు: సావిత్రీబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని రమాబాయి అంబేద్కర్ మహిళ సంఘ అధ్యక్షురాలు శోబాతాయి తుల్జాపూరే అన్నారు. శుక్రవారం మండలంలోని ఖోడద్ జెడ్పీ పాఠశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు విద్య తప్పనిసరి అని గుర్తించి పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, లక్ష్మి, సుకుమార్ పేట్కులే, మమత, కిరణ్, రవి పాల్గొన్నారు. మండలంలోని కుచూలపూర్‌లో మాలి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు వామన్, కిషన్, రాములు, దీపక్, దేవ్‌రావు, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. స్త్రీల విద్యాభివృద్ధి హక్కుల కోసం పోరాడిందని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జావిద్, జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి పృధ్వీరాజ్, హస్నాపూర్ ఉప సర్పంచ్ అశోక్, విష్ణు, గోవింద్, వినోద్, జునేద్, ఇషాన్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ త్రిరత్న బుద్ధ విహార్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతిని మహిళ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహామాయ ఉపాసిక సంఘం అధ్యక్షురాలు సోమోరే మాయబాయి, ప్రభావతి, ఉజ్వల, మాయవతి, లత, ఛాయా, ఇంద్రబాయి, దీపిక, సోనాలి, శీలాబాయి, వైష్ణవి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి



తాంసి: కొవ్వొత్తులతో సభ్యులు



ఉట్నూర్‌రూరల్: హస్నాపూర్‌లో..

తాంసి: మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. శుక్రవారం సాయంత్రం మాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబా పూలేచౌక్ వద్ద వర్ధంతి వేడుకలు నిర్వహించారు. మహిళల విద్యాభివృద్ధి కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ గంగారాం, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్, అశోక్, రవి, రాజు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

బేల: మండలంలోని జూనోని గ్రామంలో జై క్రాంతి.. జై జ్యోతి, కుమురం భీం యూత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కబడ్డీ పోటీలు శుక్రవారం ఫైనల్‌కు చేరింది. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన ఘన్‌పూర్(బోథ్) జట్టుకు ప్రథమ బహుమతి రూ.41వేలు, జామిని(జైనథ్) జట్టుకు ద్వితీయ బహుమతి రూ.21వేలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అందజేశారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాడయి వివేక్, బీఆర్ఎస్ నాయకులు సతీష్ పవార్, తన్వీర్‌ఖాన్, ప్రమోద్‌రెడ్డి, గుండవార్ అకాష్, తదితరులు పాల్గొన్నారు.